కథానిక

# ఎలక్షన్ డ్రామా

**పి. వి. సుబ్బయ్య**

కలియుగ ప్రథమపాదంలో కృష్ణా గోదావరీ నదుల మధ్యప్రదేశంలో, అనగనగా ఒక ఊరు. ఆ వూరిపేరు ప్రజాపేట; వేసవికాలంలో మిట్ట మధ్యాహ్నం, సత్యభామ చూపులకన్న తీక్ష్ణమైన సూర్యకిరణాలనూ, ప్రేమికుల నిట్టూర్పులకన్న వేడిగా మాడిపోయే తారురోడ్డునూ, - కాళ్ళకు బూటులుగాని మరేవిధమైన చెప్పులుగాని లేక పోయినా - లెక్కచేయకుండా సుందరరావు నడుస్తున్నాడు. అసలు సుందరరావుది ఆ వూరుకాదు. ఆరుమైళ్ళ దూరములో నున్న పల్లెటూరినుంచి సరుకులు కొనుక్కొని, సినిమా చూచిపోవటానికి వచ్చాడు. రోడ్డుపైన నడవవలసిన విధులు తెలియకనో, తెలిసినా రోడ్డుప్రక్కన మార్జిన్ లేదు కాబట్టోగాని రోడ్డుమధ్యమాత్రం నడుస్తున్నాడు. అంతలోనే సరికొత్త మోడల్ చవర్లెట్ కారు చాలా దురుసుగా హారన్ కొట్టుకుంటూ వచ్చి అతని ప్రక్కన ఆగింది. కారు హారన్‌కు అదిరిపడి రోడ్డుప్రక్కకు దూకి, మొఖము చిన్నదిచేసి కళ్ళు పెద్దవిచేసి కండువా సవరించుకొంటూ, కారులోనికి చూచాడు సుందర్రావు.

కారులోని కళ్ళజోడుకూడా ఒకసారి సుందరరావువైపు చూచి, వెంటనే తన దృష్టిని వెనుక సీటులోనున్న విగ్రహమువైపునకు మరల్చింది. వెనుక నున్న నల్లకోటు, బొర్రమీసాలుకూడా కళ్ళజోడు వైపునకు రెండుక్షణాలు చూచాయి. వెంటనే కోటుచేతులు 'బూర'పట్టుకొన్నాయి. బొర్ర మీసాలక్రింద దాగివున్న నోరు బూరదగ్గరికివచ్చి, పెద్దగా యీ క్రింది మాటలను చెప్పింది: "నేటి సాయంత్రము ఆరుగంటలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'ఫలానా'వారి గంభీరోపన్యాసముండును, ఉపన్యాసం ముందు ప్రఖ్యాత గాయకుల సినిమా అనుకరణ పాటలను, తరువాత ప్రఖ్యాత డ్రామా నటులు శ్రీయుత అచ్చయ్య, శ్రీమతి వరమ్మగారల నాటకము ప్రదర్శింపబడును. కాన తామెల్లరు విచ్చేసి సభను జయప్రదమొనరించి- మీ వోటు "గోముఖ వ్యాఘ్రము"గుర్తుగల పెట్టెలోనే వేయ ప్రార్థన."

సుందర్రావు పైపంచె ఇంకొకతూరి సరిచేసికొన్నాడు. కళ్లు చిన్నవిచేశాడు. మొఖము పెద్దది చేశాడు. తాను చెవులారా విన్నది నోరారా నెమరువేసుకొన్నాడు. వారంరోజులనుంచి యీ ప్రచారము ఎక్కడచూచినా కనపడుతూంది. ఒక రోజు వాళ్ళ వూరుకూడా వచ్చి పైన తాను విన్న మాటలనే చెప్పి వెళ్ళింది కారు. ఆరోజు వాళ్ళింటిప్రక్క వీరయ్య అడిగాడు: "ఏం మామా! మీటింగుకు పోదామా?"

"ఆ మనకేం అర్థమవుతుందిరా ఆ మీటింగు" అన్నాడు సుందర్రావు.

సుందర్రావు తెలివితక్కువతనానికి ఆశ్చర్యం ప్రకటిస్తూ "మీటింగంటే మీటింగ్ కాదుమామా! మీటింగ్ ఎవరిక్కావాలి? ఆ సినిమా పాటలు ఎంత కమ్మగా వుంటాయనుకొన్నావ్? 'విదేశి సరుకు'అనే డ్రామాలో ఆమె వయ్యారం, ఆ నటనా, ఆ కులుకూ తప్పక చూడవలసిందే. రైలు చార్జీ పోతేపోయింది"అన్నాడు వీరయ్య.

"ఆ నాబోటివాళ్ళకి యీ డ్రామాలు యీ మీటింగులు ఎందుకురా! మీరే చూడ్దురూ" అన్నాడు సుందర్రావు, స్వతహాగా డ్రామాపిచ్చి తక్కువ అవటంచేత.

బజారుపని పూర్తిచేసుకొనేసరికి ఐదుగంటలు దాటిపోయింది. ఇక తాను రాత్రి చేయవలసిన కార్యక్రమం గూర్చి రెండునిముషాలు ఆలోచించాడు. మొదట మీటింగు విని, డ్రామాచూచి, తదుపరి వీలయితే రెండవ ఆట సినిమా చూడటానికి నిశ్చయించుకున్నాడు.